సాక్షి ఖమ్మం

మంగళవారం । 3 । జూన్ । 2025

I



ఆకలి తీర్చేలా...

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, హరేకృష్ణ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అన్నపూర్ణ క్యాంటీన్లు వేలాది మంది ఆకలి తీరుస్తున్నాయి. IVలో



మార్కెట్ల లక్ష్యం ఖరారు

జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ.69.37 కోట్ల పన్నులు వసూలు చేయాలని నిర్దేశించారు. IVలో

గరిష్టం / కనిష్టం
39° / 28°

వాతావరణం

జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రానికి చల్లబడి కొన్నిచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సిద్ధమైన నమూనా గృహం



ఇందిరమ్మ మోడల్‌హౌస్

రఘునాథపాలెం: రఘునాథపాలెం తహసీల్ ఆవరణలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణం పూర్తయింది. మండలంలో మల్లేపల్లిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 19మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. అయితే, వడపోత తర్వాత 13 మందినే ఎంపిక చేయగా ముగ్గురు ఇంటి నిర్మాణానికి ముందుకు రాలేదు. మిగతా 10మంది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే, దశల వారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయనుండడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలతో నిర్మించుకునేలా అవగాహన కోసం తహసీల్ ఆవరణలో నమూనా గృహాన్ని నిర్మించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధులు



జెండా వందనం చేస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడమే లక్ష్యంగా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) డాక్టర్ పి.శ్రీజ సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రీజ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగుల ఉద్యమంతో తెలంగాణ సిద్ధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ ఎన్.అరుణ, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంరూరల్: అక్రమంగా పశువుల రవాణాను అడ్డుకునేలా విస్తృత తనిఖీలు చేపట్టాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రూరల్ మండలం వెంకటగిరి క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును డీసీపీ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడమే కాక పశువులను తరలిస్తున్నట్లే తేలితే అనుమతి పత్రాలు పరిశీలించాలన్నారు. సరైన పత్రాలు లేకపోతే సీజ్ చేయాలని ఆదేశించారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణా జరుగుతున్న తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలే తప్ప ఎవరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

కాకతీయుల కాలం నాటి శిలాశాసనం

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారంలో కాకతీయుల నాటి శిలాశాసనాన్ని గుర్తించారు. గ్రామ పాత బొడ్రాయి సెంటర్‌లో రావిచెట్టు వద్ద ఈ శాసనం వెలుగుచూసింది. నాలుగు అడుగుల పొడవు, అడుగు మందంతో ఉన్న నల్లరాతి బండపై ఓ వైపున 19 పంక్తులతో తెలుగు లిపిలో రాసి ఉన్న శాసనాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కోకన్వీనర్ కట్టా శ్రీనివాస్ నేతృత్వాన సోమవారం గుర్తించారు. శాసనంపై శివలింగం, దానికి రెండువైపులా సూర్యచంద్రుల చిహ్నాలు ఉన్నాయి. మహామండలీశుడు కాటీయ(రుద్రసేనాని కొడుకు) రాజ్యం ఏలుతున్నప్పుడు గోవిందమాంబ, దేవశెట్టి కొమ్మోజు తవ్వించిన రుద్రసముద్రానికి ఎకరంన్నర భూదానం చేసినట్లు ఈ శాసనం తెలుపుతోందని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బృందం కన్వీనర్ హరగోపాల్, గ్రామ పెద్దలు వున్నం వెంకయ్య, పసుమర్తి శ్రీనివాస్, తిరుమల్, షేక్ రహీముతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జాతీయజెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ (ఇన్‌సెట్) ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి



పారదర్శకత, జవాబుదారీతనమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతుండగా, అభివృద్ధి, సంక్షేమాలను ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో జిల్లాకు చెందిన అనేకమంది అసువులు బాయగా.. వీరి త్యాగాలతోనే ఏర్పడిన తెలంగాణ అన్ని రంగాల్లో మంచి ఫలితాలను సాధిస్తోందని తెలిపారు. ఈక్రమంలోనే జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఖమ్మంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అలాగే అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి ప్రసంగం ఆయన మాటల్లోనే... – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

జవాబుదారీతనం.. పారదర్శకత

అదే మా లక్ష్యం, పాలనావిధానం

- రాజీవ్ కెనాల్‌తో 1.25లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- మధిరలో ఇందిరా మహిళా డెయిరీతో మహిళల ఆర్థికాభివృద్ధి
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

పెరగనున్న ఆయకట్టు సేద్యం

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాగులోకి తీసుకురావాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోంది. రూ.100 కోట్లతో నిర్మించిన రాజీవ్ కెనాల్‌ను వినియోగించి రూ.1.25 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా పాలేరు లింక్, సత్తుపల్లి– యాతాలకుంట ట్రంక్‌కెనాల్ పనులు వేగంగా పూర్తవుతున్నాయి. రఘునాథపాలెం మండలంలో రైతులకు సాగు నీరు అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశాం. మున్నేరు నుంచి పాలేరు కెనాల్ వరకు రూ.102.92 కోట్ల అంచనా వ్యయంతో లింక్ కెనాల్ నిర్మాణానికి టెండర్లు పిలిచాం. మున్నేటి వరద ముంపునకు అడ్డుకట్ట వేసేలా ఇరువైపులా రూ.525.36 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నాం.

మహిళల ఆర్థిక సాధికారత

- మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటుచేస్తున్నాం. 21వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండేసి పాడి గేదెలు ఇచ్చి పాలు సేకరిస్తాం. అలాగే, ఇందిర మహిళా శక్తి ద్వారా మహిళా మార్ట్, 64 స్త్రీ టీ షాపు పెద్దమొత్తంలో నిధులతో 613 క్యాంటీన్ షెడ్లు, 28 పౌల్ట్రీ షెడ్లు ఏర్పాటు చేశాం.
- భూభారతితో రైతుల సమస్యలు తీరనున్నాయి. జిల్లాలోని నేలకొండపల్లిని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని సదస్సుల ద్వారా 3,224 దరఖాస్తులు స్వీకరించాం. ఆపై బోనకల్ మండలాన్ని రెండో పైలట్ మండలంగా ఎంపిక చేసి సదస్సులు నిర్వహించాం. మంగళవారం నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి.
- 2024–25 యాసంగి సీజన్‌లో జిల్లాలో ఇప్పటి వరకు 32,102 మంది రైతుల నుంచి 21,66,180 క్వింటాళ్ల ధాన్యం సేకరించాం. ఇందులో సన్న ధాన్యానికి బోనస్‌గా 47,494 మంది రైతులకు రూ.136.33 కోట్లు చెల్లించాం.
- తాగునీటి సమస్య పరిష్కారానికి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో రూ.229 కోట్లతో చేపట్టిన పనులు తుదిదశలో ఉన్నాయి. వైరాలో రూ.28 కోట్లు, మధిరలో రూ.17 కోట్ల నిధులతో పనులు పూర్తిచేశాం.
- జిల్లాలోని 60 పాఠశాలల్లో న్యూట్రిగార్డెన్స్, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహారం అందిస్తున్నాం. మధిరలో రూ.4కోట్లు, సిరిపురంలో రూ.5 కోట్లు, కూసుమంచి మండలంలో రూ.5.50 కోట్లతో జూనియర్ కళాశాలల భవన నిర్మాణాలు చేపట్టాం. ఖమ్మం మెడికల్ కాలేజీకి నూతన భవనాల నిర్మాణం రూ.130 కోట్లతో చేపడుతున్నాం. అలాగే, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 20 – 25 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం సమీకృత రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నాం.
- పర్యాటక అభివృద్ధికి నూతన పాలసీ తీసుకొచ్చాం. వెలుగుమట్ల అర్బన్‌పార్క్ వద్ద 40 అడుగుల రోడ్డు, ప్లే ఏరియా, బోటింగ్ ఏరియా అభివృద్ధి చేశాం. ఖమ్మం ఖిలాపైకి రోప్‌వే నిర్మాణానికి రూ.29 కోట్లతో ప్రతిపాదించాం. పాలేరు రిజర్వాయర్ అభివృద్ధి, పర్యాటకులకు సౌకర్యాల కల్పన కోసం రూ.16.75 కోట్లతో ప్రతిపాదించి రూ.5కోట్లు మంజూరు చేశాం.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్‌ఓ పద్మశ్రీ, డీఆర్డీఓ సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, పెనుబల్లి మండలం పులిగుండాల వద్ద ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన సఫారీ వాహనాన్ని పరేడ్ గ్రౌండ్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి ప్రారంభించారు.

నూతనంగా 5వేల రేషన్‌కార్డులు

జిల్లాలో కొత్తగా 5,298 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేయడంతో 19,127 మందికి బియ్యం అందుతోంది. అలాగే, 17,342 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా.. 14,649 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. ఇందులో 9,326 మందికి మంజూరు పత్రాలు ఇచ్చాం. ఎప్పటికప్పుడు నిధులను గ్రీన్‌చానల్ ద్వారా చెల్లిస్తున్నాం.

ఉదయం ఎండ.. రాత్రి వాన

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన వాతావరణం
- దుక్కులు దున్నడానికే కాక సిద్ధం చేసిన వారికీ ప్రయోజనం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సోమవారం ఎండ తీవ్రత పెరిగింది. మే చివరి వారం నుంచి నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురిశాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. అయితే, మూడు రోజులుగా వాన ముఖం చాటేయడంతో తిరిగి ఎండ తీవ్రత పెరుగుతోంది. రోహిణి కార్తె ప్రభావంతో సోమవారం ముదిగొండ మండలం పమ్మిలో గరిష్ఠంగా 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, బాణాపురంలో 39.9, నేలకొండపల్లిలో 39, ఖమ్మం ఖానాపురంలో 38.7, చింతకానిలో 38.6, రఘునాథపాలెం, ఖమ్మం కలెక్టరేట్, ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వద్ద 38.4, గంగారం 38.2, ఎర్రుపాలెం 38.1, కాకరవాయి 38, ఖమ్మం కాష్‌నగర్, ఏన్కూరులో 37.9, మధిర, గౌరారం, పెనుబల్లి, పంగిడి, వైరా, ముదిగొండలో 38.7, బచ్చోడులో 37.7, కుర్నవల్లి, మంచుకొండ, సత్తుపల్లి, గుబ్బగుర్తి, తల్లాడ, పల్లెగూడెంలలో 37.5, కూసుమంచి 37.4, తిరుమలాయపాలెం, పెద్దగోపతి, తిమ్మారావుపేట, వేంసూరు, సత్తుపల్లి ఓసీల వద్ద 37.3, కొణిజర్ల, కల్లూరు, సిరిపురం, రావినూతలలో 37.2, సదాశివునిపాలెంలో 37.1, నాగులవంచ, లింగాలలో 36.9, గేటు కారేపల్లిలో 36.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, రాత్రి 7గంటల వరకు వాతావరణం పొడిగానే ఉన్నా ఆ తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడగా జనం ఊపిరి పీల్చుకున్నారు.

దుక్కులకు ప్రయోజనం

మే చివరి వారంలో జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలతో రైతులు పంట భూముల్లో దుక్కులు చేస్తున్నారు. పత్తి, అపరాల పంటలు సాగు చేసే భూములతో పాటు వరి సాగు చేసే మాగాణి భూములను సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో సగటున ఇప్పటి వరకు 4 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదు కావడంతో దుక్కులు దున్నగా, మళ్లీ పెరిగిన ఎండతో ఆయా భూముల్లో పురుగులు, కీటకాలు నశిస్తాయని, కలుపు కూడా పోతుందని చెబుతున్నారు. ఇక ఒకటి, రెండు రోజులు వరుసగా వర్షం కురిస్తే పత్తి, అపరాల పంటల సాగుతో పాటు వరి నార్లు పోసేందుకు అవకాశముంటుంది.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తిరుమలాయపాలెం మండలంలోని రఘునాథపాలెం, గోల్‌తండా, రాజారం, దమ్మాయిగూడెం, కొక్కిరేణి గోపాలపురం తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన చేయడమే కాక పూర్తయిన పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పొంగులేటి మాట్లాడుతూ నిరుపేదలకు తొలుత ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని.. ఆతర్వాత అర్హులందరికీ మంజూరు చేస్తామని తెలిపారు. మొదటి దఫా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగా మరో విడత కేటాయిస్తామని పేర్కొన్నారు. కాగా, ఇచ్చిన మాట ప్రకారం రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, కొత్త రేషన్ కార్డులు కూడా ఇస్తున్నామని మంత్రి తెలిపారు.

నేటి నుంచి సదస్సులు

వానాకాలం సీజన్‌కు సంబంధించి త్వరలోనే రైతులకు రైతు భరోసా నిధులు విడుదలవుతాయని మంత్రి పొంగులేటి చెప్పారు. అలాగే, ధరణి స్థానంలో ప్రవేశపెట్టిన భూభారతి ద్వారా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూసమస్యలపై దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం నుంచి ఈ సదస్సులు మొదలవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వం అప్పుల భారం మోపినా ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యమాల్లో ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, మంగీలాల్, కొప్పుల అశోక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా బతుకులు రోడ్డున పడ్డాయి..

- ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు లోడింగ్ నిలిపివేయాల్సిందే..
- ఆందోళనకు దిగిన లారీల యజమానులు
- నాణ్యమైన బొగ్గు ఇవ్వడం లేదని ఆవేదన



కిష్టారం ఓసీ వద్ద టిప్పర్లు రాకుండా అడ్డుగా పెట్టిన లారీలు

సత్తుపల్లి: నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోవడంతో... కొనుగోలుదారులు మహారాష్ట్ర, ఒడిశా గనులకు వెళ్తున్నారని తద్వారా తమకు లోడింగ్ లేక జీవనాధారం కోల్పోతున్నామని సత్తుపల్లికి చెందిన లారీల యయజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సత్తుపల్లి మండలంలోని ఓసీల్లో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవుతున్నా రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ) ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ తమ బతుకులను రోడ్డున వేశారని మండిపడ్డారు. ఈమేరకు కిష్టారం ఓసీ వద్ద సోమవారం ఆందోళనకు దిగడమే కాక ఆర్‌సీహెచ్‌పీకి వెళ్లే టిప్పర్లను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇక్కడి భూమిలో బొగ్గు ఉత్పత్తి చేస్తుండగా, ఆంధ్రా కాంట్రాక్టర్లకు లబ్ధి జరిగేలా యాజమాన్యం, అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

సమస్య ఏమిటంటే...

ఓసీల ఏర్పాటుకు భూములు ఇచ్చిన నిర్వాసితులు, స్థానికులు జీవనాధారం కోసం లారీలు కొనుగోలు చేశారు. వీరికి రోజు 6వేల టన్నుల బొగ్గు లోడింగ్ ఇస్తామని పలుమార్లు అధికారులు తెలిపారు. అయితే, ఆచరణలో మాత్రం రోజుకు కేవలం 2వేల నుంచి 2,500 టన్నులు మాత్రమే ఇస్తుండడంతో 30 లారీలకే లోడింగ్ వస్తోంది. సత్తుపల్లిలో మొదటగా 650 లారీలు ఉండగా.. సరైన లోడింగ్ అందక సకాలంలో ఫైనాన్స్ కిస్తీలు చెల్లించక ఒక్కొక్కరు అమ్ముకుంటూ రావడంతో ఆ సంఖ్య ప్రస్తుతం 450కి పడిపోయింది.

నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోవడంతోనే..

సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీల్లో జీ–8, 9, 11, 13, 15, 16 రకం బొగ్గు ఉత్పత్తి అవుతోంది. ఇందులో జీ–8, 13 నాణ్యమైనది కావడంతో మంచి డిమాండ్ ఉంది. కానీ నాణ్యమైన బొగ్గును కావాల్సిన కంపెనీలకు కాక రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ) ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఈక్రమాన సింగరేణి క్వాలిటీ మేనేజర్ తీరుతో వివిధ కంపెనీల బాధ్యులు ఆర్డర్లు రద్దు చేసుకుని మహారాష్ట్ర, ఒడిశా గనులకు వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కర్ణాటకకు చెందిన ఓ ప్రాజెక్టు నుంచి 5వేల టన్నులు ఆర్డర్ చేస్తే.. బొగ్గు లోడింగ్ ఇవ్వలేదని సమాచారం.

తాత్కాలిక అనుమతితో రవాణా

రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)కు రోడ్డు మార్గాన టిప్పర్ల బొగ్గు రవాణా చేసేందుకు గ్రీన్ ట్రిబ్యునల్ ద్వారా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినా ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి అధికంగా ఉందని, నిల్వ చేస్తే మంటలు వస్తున్నాయని సాకు చూపి తాత్కాలిక అనుమతితో రవాణా చేస్తున్నారు. ఏడాది దాటినా ఆర్‌సీహెచ్‌పీకి నిరంతరాయంగా బొగ్గు రవాణా చేస్తుండడంతో స్థానిక లారీలకు లోడింగ్ అందడంలేదు. ఇకపై ఆర్‌సీహెచ్‌పీకి లోడింగ్ అడ్డుకుంటామని లారీల యజమానులు చెబుతున్నారు.

జూలై నుంచి ఇస్తాం..

బొగ్గు కాంట్రాక్టు ఆర్డర్లు లేకపోవడంతోనే లోడింగ్ ఇవ్వలేకపోతున్నామని.. వచ్చే జూలై నుంచి లోడింగ్ పెంచుతామని కిష్టారం, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ పీఓలు నర్సింహారావు, ప్రహ్లాద్ లారీల యజమానులకు హామీ ఇచ్చారు. యజమానుల ఆందోళనతో వారు యూనియన్ కార్యాలయంలో చర్చించినా వారి సమాధానంతో సంతృప్తి చెందలేదు. మరో దఫా చర్చలు జరిపి లోడింగ్‌లు పెంచే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఆందోళలో లారీ యూనియన్ బాధ్యులు కొండపల్లి రమేష్‌రెడ్డి, ఎస్.కే.మౌలాలీ, కోట మోహన్ రావు, చిన్నంశెట్టి సూరిబాబు, ఎస్.కే.మస్తాన్, ఎస్.కే.ఖలీల్, దురిశెటి శ్రీనివాస రావు, కొండపల్లి క్రాంతిరెడ్డి, చిలుకూరి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెల్ట్‌షాపులు తొలగించాలని నిరసన


ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ఆందోళనలో మహిళలు

సత్తుపల్లిరూరల్: మద్యంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నందున బెల్ట్‌షాప్‌లు తొలగించాలనే డిమాండ్‌తో వేంసూరు మండలం శంభునిగూడెంకు చెందిన మహిళలు పలువురు సోమవారం నిరసన తెలిపారు. ఈమేరకు సత్తుపల్లి ఎక్సైజ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన వారు మాట్లాడారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్‌షాపులు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్సై శేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పద్మ, రాధ, మారేశ్వరమ్మ, చెన్నమ్మ, తిరుపతమ్మ, సావిత్రి, రమణ, కొలికపోగు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు


వెంకటికి ప్రశంసాపత్రం అందిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అదనపు కలెక్టర్, సంస్థ పర్సన్ ఇన్‌చార్జి పి.శ్రీనివాసరెడ్డి ప్రశంసాపత్రాలు అందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఖమ్మంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఆఫీస్ సబార్డినేట్ వెలిశాల వెంకటి, కల్లూరు సూపర్‌వైజర్ పెరుగు నాగరాజు, నేలకొండపల్లి ఉద్యోగి బొడ్డు సంతోష్‌కు ప్రశంసాపత్రాలు అందించారు. సంస్థ మేనేజర్ కె.సందీప్, ఉద్యోగులు పి.వినోద్, గోపి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

కారేపల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా నానిన పెంకుటింటి కప్పు కుప్పకూలింది. మండలంలోని గేటుకారేపల్లికి చెందిన భూక్యా శాంతి బాలికల ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తోంది. ఆమె సోమవారం పక్కనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లగా, ఇప్పటికే వరుస వర్షాలతో నానిన ఇంటి కప్పు, గోడలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఆ సమయంలో శాంతి లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. కాగా, అధికారులు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆమె కోరింది.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి

కారేపల్లి: పురుగుల మందు తాగిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని స్టేషన్ చీమలపాడుకు చెందిన బానోతు మంగ్లీ(70) భర్త ఏడాది క్రితం మృతి చెందగా, అప్పుడప్పుడూ మద్యం తాగుతుండేది. ఈ క్రమంలోనే గత నెల 29న మద్యం తాగాక మంగ్లీ పురుగుల మందు తాగింది. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందిందని ఎస్‌ఐ బి.గోపి తెలిపారు.

స్పృహ తప్పిన ఏఆర్ కానిస్టేబుల్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ హుస్సేన్ పాషా స్పృహ తప్పి కిందపడ్డాడు. దీంతో సహచర సిబ్బంది 108 వాహనంలోకి ఎక్కించి ప్రాథమిక చికిత్స అందించారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఆయన స్పృహ కోల్పోగా, చికిత్స అనంతరం కోలుకున్నాడని అధికారులు తెలిపారు.

రుణ బాకీ పేరిట వితంతువుల పింఛన్ నిలిపివేత

మధిర: వితంతు, ఒంటరి మహిళ పింఛన్లు అందుకుంటున్న మహిళలు సభ్యులుగా ఉన్న మహిళా సంఘం పేర బకాయి ఉందంటూ పది నెలలుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ పింఛన్లు నిలిపివేయడంపై ఆవేదన చెందుతున్నారు. మధిర మండలం దెందుకూరుకు చెందిన కొత్తపల్లి సుధ, పగిడిపల్లి కాంతమ్మ వితంతువుల పింఛన్, గద్దల పున్నమ్మ ఒంటరి మహిళ పింఛన్ తీసుకుంటున్నారు. అయితే, పది నెలలుగా దెందుకూరులోని తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్ పింఛన్ ఆపేయడంతో ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాము సభ్యులుగా ఉన్న డ్వాక్రా గ్రూపులో కొందరు రుణబకాయి చెల్లించకపోవడమే ఇందుకు కారణమంటూ మేనేజర్ చెప్పారని తెలిపారు. ఈవిషయమై బ్యాంక్ మేనేజర్ వెంకన్నను వివరణ కోరగా అంజలి డ్వాక్రా గ్రూపు తరఫున రుణం తీసుకోగా కొందరు సభ్యులు తిరిగి చెల్లించడం లేదన్నారు. గ్రూపు నిబంధనల ప్రకారం సభ్యులెవరు చెల్లించకున్నా అందరూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని, అందుకే వారి అకౌంట్ హోల్డ్‌లో పెట్టామని వెల్లడించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా..

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులతో ప్రతిభ చాటారు. ఈమేరకు ఆయా విద్యార్థులను కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు అభినందించి వివరాలు వెల్లడించారు. – ఖమ్మం సహకారనగర్

న్యూవిజన్ ప్రభంజనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే.ప్రసాద్ తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో పేరాల ప్రణవ్ 497వ ర్యాంక్, మరో కేటగిరీల్లో అజ్మీరా రోషిక్ మణిదీప్ 5వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ఇక భూక్యా పీయుష్ వర్ధన్ 102, అజ్మీరా జిగీష 204, అంగోతు శ్యామ్ 205, భూక్యా యశ్వంత్ 394, పేరాల ప్రణవ్ 497, గూడె కార్తీక్‌సాయి 537, చంద్రసాయికృష్ణ 556, గుగులోతు షణ్ముఖ 562, తేజావత్ స్రవంతి 605, బానోతు వివేక్‌రామ్ 618, భూక్యా ప్రతీక్ 678, స్వర్ణ మనస్విక్ 770, గంగావత్ చరణ్‌తేజ్ నాయక్ 888, రామ కౌశిక్ 953, పగిడిపల్లి చేతన్‌చంద్ర 977, కంసాని మధుర హాసిని చౌదరి 1,026, భుక్యా శివనాగచైతన్య 1,093, బానోతు కౌశిక్ 1,377, ధర్మసోత్ రాహుల్ నాయక్ 1,427, వడ్లమూడి ఆశిష్ 1,433, ఆళ్ల హేమంత్ 1,683, పండేటి యశస్విన్ 1,797, వాంకుడోతు బిందుబాయ్ 1,800, బానోతు దీపిక 1941, బానోతు మోహన్ సాయిలక్ష్మి 1,962వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సీహెచ్.గోపీచంద్, సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య.. ఆల్‌టైం రికార్డు


విజయ సంకేతం చూపిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, విద్యార్థులు, అధ్యాపకులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లతో ఆల్‌టైం రికార్డు సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఆలిండియా స్థాయిలో హెచ్.జశ్వంత్ 9వ ర్యాంక్, ఎస్‌వీ.వీరబ్రహ్మం 92, బి.లిగ్నేష్ 144, వి.కుషాల్ 165, బి.విక్టోరియా 199, బి.జయంత్ 221, ఐ.అను 258, ఎం.జ్ఞాతిక్ లక్కి 270, డి.అంకిత 272, జి.కార్తీక్ 330, డి.రూపేష్ 370, ఎస్.జస్మిత 375, బి.వరుణ్ సాయి 383, హెచ్.జీవన్ 456, బి.మృదున 478, జి.ఉదయ్ కృష్ణ 502, జి.అమృత హాసిని 527, బి.సిద్ధు 538, బి.సిద్ధార్థ 560, బి.వంశీ 598, జె.లహరి 602, జి.రాహుల్ 664, బి.మహేష్ 673, టి.రోహిత్ 677, బి.పండు చరణ్ 761, ఎల్.మనోజ్‌కుమార్ 768, ఎం.లోకేష్ 847, బి.సుజిత్ 850, జె.మాయావతి 870, హెచ్‌ఎస్ చరణ్‌తేజ 882, వి.ప్రణతి 897, ఈ.శ్రీకర్ 921, బి.మురళి 928, టి.జశ్వంత్ కుమార్ 947, బి.లావణ్య 1,007వ ర్యాంక్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాదూర్, ఎగ్జిక్యూటివ్ డీన్ ఎన్‌ఆర్ ఎస్‌డీ.వర్మ, డీన్ జె.కృష్ణ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాశ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్ట్‌కు ఉత్తమ ర్యాంకులు


విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

హార్వెస్ట్ విద్యాసంస్థల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఆలిండియా స్థాయిలో వివిధ కేటగిరీల్లో బి.సాయిచరణ్ 83వ ర్యాంకు, బి.సంజయ్ 207, ఎం.నాగయశ్వంత్ 393, బి.సిద్ధార్థ్ 395, డి.శ్రీనివాస గౌతమ్‌రెడ్డి 686, వి.చరణ్ గోపాల్‌స్వామి 1,092, బి.మోక్షజ్ఞ 1,159, పి.క్రిష్ సాత్విక్ 1,163, ఎ.గణేష్ 1,195, ఎన్.సీ.హెచ్.జస్వంత్ సాయి 1,268, ఎన్.రాఘవేంద్ర నవనీత్ 2,108, పి.ప్రేమ్‌వర్ధన్ 5,078, వి.సాయిదీపక్ 6,001 ర్యాంకు సాధించారని వెల్లడించారు.

రెజొనెన్స్ జయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లతో జయభేరి మోగించారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్‌వీ. నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. టి.స్నేహ మృదుల 89వ ర్యాంక్, బి.రాకేష్ 230, బి.అభినాయక్ 342, జె.మదన్ 371, జి.సురేష్ 557, బి.హర్షవర్ధన్ 906, బి.శ్యామ్ 1,860, ఆర్.గురుప్రసాద్ 2,097, గోపిచంద్ 2,275, జి.దివ్యతేజ 2,847వ ర్యాంక్ సాధించగా, మరికొందరు సైతం ఉత్తమ ర్యాంక్‌లు సాధించారన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, భాస్కర్‌రెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ సాధిస్తా..



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆలిండియా స్థాయి 9వ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. మా అమ్మానాన్న కిరణ్మయి, రాంబాబు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. వీరే కాక కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల సహకారంతో సాధించా. భవిష్యత్‌లో సివిల్స్‌కు ఎంపిక వాలనేది లక్ష్యం.

– హెచ్.జశ్వంత్‌రామ్, ఆలిండియా 9వ ర్యాంకర్, శ్రీ చైతన్య కాలేజీ

ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యం



ఐఐటీ పూర్తిచేసి ఇంజనీర్‌గా స్థిరపడాలనేది నా లక్ష్యం. అమ్మ కల్పన గృహిణి కాగా, తండ్రి అనిల్‌కుమార్ వ్యాపారి. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన నేను తల్లిదండ్రులు, కళాశాల యజమాన్యం సహకారంతో మెరుగైన ర్యాంక్ సాధించా.

– బి.సాయిచరణ్, ఆలిండియా 83వ ర్యాంకర్, హార్వెస్ట్ విద్యార్థి

సమగ్రాభివృద్ధే లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర: మధిర నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. మధిర మండలం మాటూరులో రూ.2.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సబ్ ఏర్పాటుతో మాటూరు, మాటూరుపేట, నాగవరప్పాడు, సిద్ధినేనిగూడెం, అంబారుపేట గ్రామాలకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. ఇదే కాక అవసరమైన చోట సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈలు బండి శ్రీనివాసరావు, కె.హీరాలాల్, ఏడీఈలు ఏ.కిరణ్ చక్రవర్తి, శ్రీనివాస్, ఎం.అనురాధ, ఈఈ జి.వెంకటేశ్వర్లు, ఏడీఈ మధిర రూరల్ ఏఈ ఎస్.మైథిలి పాల్గొన్నారు.

ఈ చెత్తాచెదారం ఏమిటి?

ఐబీ డీఈ నాగబ్రహ్మయ్యపై డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా జాలిముడి ప్రాజెక్టును తనిఖీ చేశారు. అక్కడ మద్యం సీసాలు, చెత్తాచెదారం ఉండడాన్ని గమనించిన ఆయన నిర్వహణ కోసం నిధులు మంజూరు చేసినా నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు.


చింతకానిలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

రూ.25కోట్లతో రహదారి, సెంట్రల్ లైటింగ్

చింతకాని: చింతకానిలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. రూ.25 కోట్ల నిధులతో చింతకాని నుంచి కొణిజర్ల వరకు డబుల్ లేన్ బీటీ రహదారి నిర్మాణంతో పాటు చింతకానిలో ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ నిర్మానం పనులకు శంకుస్థాపన చేయగా.. కాంగ్రెస్ నాయకులు, స్థానికులకు ఆయనకు స్వాగతం పలికారు. కాగా, చింతకానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని స్థానికులు చెప్పగా ఆర్టీసీ ఆర్‌ఎంతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీచేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కన్నెబోయిన గోపి, బందెల నాగార్జున్, కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం ప్రాణమైనా ఇస్తా..

పాలేరు మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి/కూసుమంచి: బీఆర్‌ఎస్ కార్యకర్తలను తన ప్రాణం అడ్డు వేసైనా కాపాడుకుంటానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఎవరు వేధించినా సహించేది లేదని చెప్పారు. ఎదుటి వారు ఒక దెబ్బ కొడితే... తాము రెండు దెబ్బలు కొడతామని తెలిపారు. తన వద్ద డబ్బు లేకపోయినా చేతనైన మేర సాయం చేస్తానని, కనీసం రెండు శాతం మంది ప్రజలైనా తాను మంచి చేయలేదని చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని వెల్లడించారు. కాగా, ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా విజయం బీఆర్‌ఎస్‌నే వరిస్తుందని కందాళ ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీ వైస్ మాజీ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్యతో పాటు నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి, షేక్ హుస్సేన్, కమదన ప్రవీణ్, యాతాకుల భాస్కర్, గోలుసు రవి, మాదాసు ఆదాం, దాసరి ఉదయ్, దేవరశెట్టి మురళి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కూసుమంచి మండలం గంగబండ తండాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కందాళ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


కొత్తకొత్తూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

విలువలు కలిగిన నేత పోటు ప్రసాద్

స్తూపాన్ని ఆవిష్కరించిన సీపీఐ నేత పువ్వాడ

ఖమ్మంఅర్బన్: సమకాలీన రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యత ఇచ్చే నేతగా పోటు ప్రసాద్ నిలిచిపోతారని, ఆయన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ స్మారక స్తూపాన్ని ఖమ్మం ఇందిరానగర్ వద్ద ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేయగా సోమవారం పువ్వాడ ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐఎస్‌ఎఫ్, ఏఐటీయూసీ, సీపీఐలో కీలక పాత్ర పోషించిన ప్రసాద్ అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాగం హేమంతరావు, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే.జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, పోటు కలావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వరదా నర్సింహారావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


స్తూపాన్ని ఆవిష్కరించిన నాగేశ్వరరావు, నాయకులు

రాష్ట్ర ఆవిర్భావానికి బీజం వేసింది బీజేపీనే...

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి బీజం వేసింది బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. చిన్న రాష్ట్రాలతోనే సుపరిపాలన సాధ్యమని పేర్కొంటూ పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను బీజేపీ ఎంపీలు వినిపించారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గెంట్యాల విద్యాసాగర్, సన్నే ఉదయ్ ప్రతాప్, గోంగూర వెంకటేశ్వరరావు, మందడపు సుబ్బారావు, జ్వాలా నర్సింహారావు, అల్లిక అంజయ్య యాదవ్, రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, మందడపు సరస్వతి తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రజలకు బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో...

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ జాతీయ జెండా ఎగురవేశారు. ఆతర్వాత పెవిలియన్ మైదానం సమీపాన అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అప్పుల భారంతో రైతు ఆత్మహత్య

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడికి రైతు అప్పుల భారంతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పి.వీరబాబు(55) స్వంత భూమి మూడెకరాలకు తోడు మరికొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది పత్తి, మిర్చి వేస్తే వాతావరణం అనుకూలించక, గిట్టుబాటు ధర లేక నష్టపోయాడు. దీంతో రూ.15లక్షల మేర అప్పుల్లో కూరుకుపోయిన ఆయన స్థానిక పాఠశాల ప్రాంగణంలో సోమవారం గడ్డి మందు తాగగా స్థానికులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా, వీరబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నీటి సంప్‌లో పడి చిన్నారి మృతి


శ్రీరాజ్యవి (ఫైల్)

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని రేగులచలకలో సోమవారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఇంట్లోని నీటి సంప్‌లో ప్రమాదవశాత్తు పడిన చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రేగులచలకకు చెందిన ఆటో డ్రైవర్ సత్తి నరేష్–వినోద్ కుమారి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రీరాజ్యవి (5) ఇంటి ముందు అడుకుంటూ ప్రమాదవశాత్తు అక్కడి నీటి సంప్‌లో పడింది. తల్లి ఇంటి పనుల్లో ఉండగా ఈ విషయాన్ని గుర్తించలేదు. కాసేపటి తర్వాత చిన్నారి ఎటు వెళ్లిందోనని ఆరా తీస్తుండగా సంప్‌లో కనిపించడంతో బయటకు తీసి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అంతసేపు కళ్ల ముందు ఆడుకున్న చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో నిరుపేదనైన తన పేరు లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. మండలంలోని మంగాపురంతండాకు చెందిన ధరావత్ కేశ్యా పేరు జాబితాలో పేరు సోమవారం ఆయన పంచాయతీ కార్యాలయం వద్ద పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. గ్రామస్తులు అడ్డుకోవటంతో వెనక్కి తగ్గినప్పటికీ ఆ కాసేపటికి ఒంటిపై పోసుకోగా స్థానికులు అడ్డుకుని ఇంటికి తీసుకెళ్లారు.

మోకాళ్ల పై కూర్చుని నిరసన

కారేపల్లి: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదంటూ కారేపల్లి మండలం పేరుపల్లిలో పలువురు అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. రేకుల ఇళ్లలోఉంటున్న తాము కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నా ఇళ్లు మంజూరు ఏయలేదని వాపోయారు. కొందరి స్వార్థంతో ఈ పరిస్థితి ఎదురైనందున అధికారులు స్పందించాలని కోరారు. ఈకార్యక్రమంలో స్థానికులు పప్పుల నిర్మల, పప్పుల వెంకటేశ్వర్లు, అజ్మీరా సరిత, శంకర్, ధరా బక్కయ్య, అజ్మీరా నగేష్, ధారా రాంబాబు, పాయం బిక్షపతి, రవి, గుగులోతు సుభద్ర, కోటం నాగమణి, అజ్మీరా లక్ష్మి, విక్రమ్, గడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాలు


విద్యార్థినుల నృత్యప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సంబంధించి రూపొందించిన శకటాలు, స్టాళ్లు ఆకట్టుకున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో రవాణాశాఖ (మహాలక్ష్మి) బస్సు శకటం, పౌర సరఫరాల శాఖ ద్వారా ఉచిత బియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోళ్లు, గృహ నిర్మాణ శాఖ శకటం ఇందిరమ్మ ఇంటి నమూనాతో రూపొందించిన శకటాలను ప్రదర్శించారు. వీటితో పాటు సంక్షేమ శాఖలు, రవాణా శాఖ, పర్యాటక శాఖల శకటాలు సైతం ఆకట్టుకున్నాయి. అంతేకాక వైద్య ఆరోగ్య శాఖ, డీఆర్‌డీఏ, విద్యుత్ తదితర శాఖల ద్వారా అమలవుతున్న పథకాలతో స్టాళ్లు ఏర్పాటు చేశారు. కాగా, వేడుకల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు అలరించాయి.

– ఖమ్మం సహకారనగర్


సంక్షేమ శాఖల శకటాల ముందు అధికారులు


ఇందిరమ్మ ఇంటి నమూనాతో శకటం

అడవి జంతువు మాంసం స్వాధీనం

సత్తుపల్లిరూరల్: ఓ వ్యక్తి వద్ద నుంచి అడవి జంతువు మాంసాన్ని అటవీ శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని జగన్నాథపురం పునరావాస కాలనీకి చెందిన ఓ వ్యక్తి వద్ద అటవీ జంతువు మాంసం ఉందనే సమాచారంతో అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాంసం లభించడంతో ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఎస్‌ఓ కొండారెడ్డి తెలిపారు. అయితే, మాంసం ఏ జంతువుదో తేలాల్సి ఉందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

'న్యూలిటిల్ ఫ్లవర్స్' విద్యార్థులకు అభినందన



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన వి.కుశాల్ 165, ఎం.నాగ యశ్వంత్ 393, రాహుల్‌దేవ్ 4,068 ర్యాంకులు సాధించగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సోమవారం అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్, డైరెక్టర్ సుమన్, ప్రిన్సిపాల్ భువనప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ



పాగి శశాంక్

మధిర: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మధిరకు చెందిన పాగి శశాంక్ జాతీయస్థాయిలో 3,354 ర్యాంక్ సాధించాడు. 1 – 10వ తరగతి వరకు మధిర శ్రీ చైతన్య పాఠశాలలో చదివిన ఆయన ఇంటర్‌లో వెయ్యికి 986 మార్కులతో ప్రతిభ చాటారు. ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ర్యాంకు సాధించిన శశాంక్‌ను పలువురు అభినందించారు.

రహదారి మరమ్మతు చేయించాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల నుంచి ఏన్కూర్ వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైనా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం రాస్తారోకో చేశారు. నిమ్మవాగు సమీపాన చేపట్టిన ఆందోళనలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ మాట్లాడుతూ.. కొత్త రహదారి నిర్మాణం మాటేమో కానీ కనీసం మరమ్మతు చేయించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతరం డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన సైకిల్‌యాత్ర చేపట్టారు. నాయకులు భూక్యా వీరభద్రం, ప్రభాకర్, రమేష్, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీనివాస్, నవీన్, గిరిధర్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ఖమ్మంస్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఖమ్మం మహబూబ్ కరాటే స్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన ఎస్.నియాన్ష్, పి.కుశల్, ఉద్యాంష్‌దత్తా, పి.అక్షిత, సయ్యద్ అమీర్‌పాషా, ఆర్.శశి, ఎస్.శ్రీసాహిత్య, రూప, కె.గణేశ్, సయ్యద్ అదిల్‌పాషా పతకాలు గెలుచుకున్నారు. వీరిని కరాటే స్కూల్ మాస్టర్ ఎండీ మహబూబ్ తదితరులు అభినందించారు.

ఇక మరింత వేగం !



ట్రాక్టర్‌పై కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ, తరలింపునకు ఇప్పటివరకు పలు వాహనాలు ఉన్నాయి. అయితే, పారిశుద్ధ నిర్వహణ మరింత మెరుగుపడేలా కొత్తగా 19 ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు వంద రోజుల ప్రణాళిక అమలు మొదలుపెట్టిన సోమవారం ఈ ట్రాక్టర్లను మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. అనంతరం ఓ ట్రాక్టర్‌ను కమిషనర్ అభిషేక్ ఇలా స్టార్ట్ చేసి కార్పొరేటర్లు, ఉద్యోగులతో కలిసి విజయ సంకేతం చూపించారు.

జయరాజుకు గుర్తింపుపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ప్రజా పోరాటానికి స్ఫూర్తిని అందించిన కవి, గాయకుడు, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు జయరాజును రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించి, రూ. కోటి నగదు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. జయరాజు సింగరేణి కార్మిక ఉద్యమ నిర్మాతగా ఉమ్మడి జిల్లా వాసులకు సుపరిచితులని కొనియాడారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్య, ఆశ్రమం కో ఆర్డినేటర్ సుగుణారావు ఉన్నారు.

ఆకలి తీర్చేలా..



ఖమ్మం పెవిలియన్ మైదానం సమీపంలోని క్యాంటీన్ వద్ద భోజనం చేస్తూ..

రూ.5 కే 'అన్నపూర్ణ' భోజనం

- పేదల కడుపు నింపుతున్న క్యాంటీన్లు
- హరేకృష్ణ చారిటబుల్ ట్రస్ట్, కేఎంసీ భాగస్వామ్యంతో నిర్వహణ

ఖమ్మంమయూరిసెంటర్: అన్నదానం మహాదానం అంటారు.. ఒకరి కడుపు నింపితే లభించే పుణ్యం వెలకట్టలేనిది. అయితే, ప్రతిరోజు ఎందరో నిరుపేదలు ఆకలితో అలమటిస్తుంటారు. వీరే కాక వివిధ పనుల నిమిత్తం ఖమ్మం జిల్లా కేంద్రానికి వచ్చే వారి కడుపు నింపేలా ప్రభుత్వ భాగస్వామ్యంతో హరేకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తోంది. నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఏర్పాటైన ఈ ట్రస్ట్‌కు ప్రభుత్వం అండదండలు అందిస్తుండటంతో క్యాంటీన్ల ద్వారా పలువురికి తక్కువ ధరకే భోజనం అందుతోంది. పట్టణ ప్రాంతాల్లో పని కోసం వచ్చే కార్మికులు, నిరుపేదలు, పూటగడవడానికి ఇబ్బందిపడే వారికి ఈ భోజనం పరబ్రహ్మ స్వరూపంలా మారింది.



పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

నిరుపేదల ఆకలి తీరుస్తూ..

పేదలు, అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా హరేకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటైంది. ఈ ట్రస్ట్ ద్వారా అతితక్కువ ధరకు పేదలకు భోజనం అందిస్తున్నారు. ఖమ్మంలోని క్యాంటిన్ల ద్వారా రోజువారీ కార్మికులతోపాటు యాచకులు, ఆటోడ్రైవర్లు, నిరుపేద విద్యార్థులు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పనిపై వచ్చే వారు తృప్తిగా భోజనం చేస్తున్నారు. నాణ్యమైన బియ్యంతోపాటు పోషకాలు అందించే వంటకాలను సమకూరుస్తున్నారు. అన్నంతోపాటు కూర, సాంబారు, పచ్చడి అందిస్తున్నారు. ప్రతీ సోమవారం భోజనంతోపాటు స్వీట్ ఇస్తుండడం విశేషం.



రూ.5 చెల్లిస్తే చాలు

ప్రస్తుత పరిస్థితుల్లో టీ తాగాలంటే రూ.10 నుంచి రూ.20 వరకు చెల్లించాల్సిందే. కానీ నాణ్యమైన, పోషకాలతో కూడిన భోజనం రూ.5కే ఈ క్యాంటీన్ల ద్వారా అందిస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో హరేకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అన్నపూర్ణ క్యాంటీన్ పేరుతో పేదలకు భోజనం అందిస్తోంది. ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్, గాంధీచౌక్, ఎన్టీఆర్ సర్కిల్, పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లు ఏర్పాటుచేశారు. ఇందుకోసం ట్రస్ట్ నిర్వాహకులు రూ.24.25 చార్జి చేస్తుండగా.. కేఎంసీ ద్వారా ఒక్కో భోజనానికి రూ.19.25, రూ.5 వినియోగదారుడి వద్ద వసూలు చేస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని చారిటబుల్ ట్రస్ట్ భరిస్తోంది.

రోజుకు వందలాది మంది...

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రోజుకు వందలాది మంది భోజనాలు పంపిణీ చేస్తున్నట్లు సూపర్‌వైజర్లు చెబుతున్నారు. ఒక్కో క్యాంటీన్ వద్ద 100 – 150 మంది.. కొన్ని రోజుల్లో 200 మంది వరకు భోజనం చేస్తారని తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా నగర, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించే క్యాంటీన్లలో భోజనాలు సమకూర్చేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో కిచెన్లు ఏర్పాటు చేశారు. ఖమ్మం క్యాంటీన్లకు వరంగల్‌లోని ట్రస్ట్ కిచెన్ నుంచి తీసుకొస్తున్నారు. వరంగల్‌లో ఉదయం 8గంటలకల్లా భోజనాలు సిద్ధం చేసి ఆటోల్లో ఖమ్మంకు తీసుకొస్తారు. ఖమ్మంతో పాటు కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ క్యాంటీన్లకు సైతం వరంగల్ నుంచే భోజనాలు అందుతున్నాయి. మధ్యాహ్నం 12గంటల్లోగా భోజనాలు చేరుకుంటుండగా.. మధ్యాహ్నం 2 గంటల వరకు వడ్డిస్తారు.

తృప్తిగా ఉంది..



పనిపై బయటకు వచ్చినప్పుడు క్యాంటీన్‌లోనే భోజనం చేస్తా. రూ.5కే కడుపు నిండా నాణ్యమైన భోజనం పెడుతున్నారు. ఇక్కడకు వచ్చి భోజనం చేసినప్పుడల్లా తృప్తిగా ఉంటుంది. ప్రతీ వారంలో కనీసం రెండు, మూడు సార్లు క్యాంటీన్‌లోనే భోజనం చేస్తాం.

– నవీన్‌కుమార్, ఖమ్మం

భోజనం బాగుంటుంది..



కుటుంబ పోషణ కోసం ఆటో నడుపుతుంటా. మధ్యాహ్నం ఇంటికెళ్లలేక హోటల్‌లో భోజనం చేసేవాడిని. పెరిగిన రేట్లతో ఆ పరిస్థితి లేకపోగా.. క్యాంటీన్లు ఏర్పాటయ్యాక మాలాంటి వాళ్లకు మేలు జరుగుతోంది. రూ.5కే మంచి భోజనం పెడుతున్నారు.

– తిరుపతి, ఆటోడ్రైవర్

చదువుకుంటూనే వడ్డిస్తున్నా..



పాత మున్సిపాలిటీలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్నా. ఇక్కడ క్యాంటీన్ ఏర్పాటవడంతో సూపర్‌వైజర్‌గా చేరా. భోజనాలు దింపుకొని వడ్డిస్తే నెలకు రూ.5వేలు ఇస్తున్నారు. దీంతో చదువుతో పాటు ఇక్కడ నాకు ఉపాధి దొరికినట్లయింది.

– టి.దివ్య, సూపర్‌వైజర్

మార్కెట్ల లక్ష్యం ఖరారు



నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం



చెక్‌పోస్టు వద్ద లారీని తనిఖీ చేస్తున్న ఉద్యోగి

- ఈ ఏడాది రూ.69.37 కోట్ల వసూళ్లకు ప్రణాళిక
- గతేడాది కంటే రూ.6 కోట్ల పెంపు

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల ద్వారా వసూలు చేయాల్సిన పన్నులకు సంబంధించి లక్ష్యాన్ని ఖరారు చేశారు. గత ఆర్థిక సంవత్సరం లక్ష్యానికి మించి ఆదాయం నమోదైంది. దీంతో 2025–26 సంవతసరానికి గాను జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ల ద్వారా రూ.69.37 కోట్ల వసూలుకు మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించింది.

గత ఏడాది లక్ష్యానికి మించి

ఖమ్మం, నేలకొండపల్లి, మధిర, కల్లూరు, వైరా, ఏన్కూరు, సత్తుపల్లి, మద్దులపల్లిలో వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.63.15 కోట్ల లక్ష్యాన్ని విధించగా రూ.65.56 కోట్ల ఆదాయం నమోదైంది. దీంతో ఈసారి రూ.69.37 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. తద్వారా దాదాపు రూ.6 కోట్లు పెంచినట్లయింది. అయినప్పటికీ లక్ష్య సాధన కోసం మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నారు. మార్కెట్లలో వ్యాపారులు చేసే కొనుగోళ్లలో కొంత శాతం పన్ను రూపంలో వసూలు కానుంది. అలాగే, వివిధ ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల ద్వారా సెస్ వసూలు చేయనున్నారు.

మార్కెట్ల వారీగా గత ఏడాది, ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం (రూ.కోట్లలో)

మార్కెట్	గత ఏడాది	ఈ ఏడాది
ఖమ్మం	30	35
మధిర	4.75	4.99
నేలకొండపల్లి	3.78	4
కల్లూరు	5.67	5.44
వైరా	6.73	6.29
ఏన్కూరు	4.87	4.95
సత్తుపల్లి	4.94	5.12
మద్దులపల్లి	3.15	3.21

లక్ష్యాన్ని చేరుకుంటాం...



ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన పన్నుల లక్ష్యాన్ని చేరుకునేలా ఇప్పటి నుంచే కృషి చేస్తున్నాం. అన్ని మార్కెట్లలో అధికారులు, సిబ్బంది, పాలకవర్గాలు సమన్వయంతో ఇది సాధ్యమవుతుంది. ఈ ఏడాది రూ.69.37 కోట్ల లక్ష్యం సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

– ఎం.అలీం, మార్కెటింగ్ అధికారి, ఖమ్మం

ఉద్యోగుల కృషితో...



వ్యవసాయ మార్కెట్ ఉద్యోగులు, సిబ్బంది పనితీరు సంతృప్తిగా ఉంది. వీరి కృషితో గత ఏడాది లక్ష్యానికి మించి పన్నులు వసూలయ్యాయి. ఇదే స్ఫూర్తితో ఈసారి కూడా లక్ష్యసాధనకు కృషి చేస్తున్నాం. ఉద్యోగులకు పాలకవర్గం తరఫున పూర్తి సహకారం అందించనున్నాం.

– వి.సీతారాములు, నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్

బ్యాడ్మింటన్ పోటీలకు 7, 8 తేదీల్లో ఎంపికలు

పాల్వంచ: ఈ నెల నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రస్థాయిలో జరిగే బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపికలు చేయనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ కె.సావిత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం వేపలగడ్డలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 7, 8వ తేదీల్లో అండర్ 11, 13, 15, 17,19 విభాగాల్లో బాల బాలికలతో పాటు 35 ఏళ్లు, 75 ఏళ్లు పైబడిన వారిని పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 90597 22803 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నలుగురిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ గొడవకు దిగిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. చర్చి కాంపౌండ్ కూడలి వద్ద ఒకే ద్విచక్ర వాహనంపై చేరుకున్న నలుగురు ఎదురుగా వచ్చిన కారును ఆపి డ్రైవర్‌పై దాడికి యత్నించారు. దీన్ని అడ్డుకునేందుకు యత్నించినా వారిపైనా దురుసుగా ప్రవర్తించారు. దీంతో పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఫంక్షన్ హాళ్ల మధ్య దుర్గంధం

డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు



ఫంక్షన్ హాళ్ల మధ్య నిలిచిన మురుగునీరు, చెత్త

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్‌హాళ్ల సమీపంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక దుర్గంధం వెదజల్లుతోంది. ఫంక్షన్ హాళ్ల యజమానులు డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు హాళ్ల మధ్య గల ఖాళీ ప్రదేశంలోకి చేరుతోంది. దీంతో ఫంక్షన్లు చేసుకునే వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి, ఫంక్షన్ హాల్ నిర్వాహకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిండిగాల రాజేందర్‌కు ఘన సత్కారం



సన్మానం అనంతరం మాట్లాడుతున్న రాజేందర్

ఇల్లెందు: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు అయిన దిండిగాల రాజేందర్‌ను మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ నేతలు ఘనంగా సత్కరించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం ఇల్లెందులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు డిప్యూటీ సీఎం, మంత్రి పర్యటన

ఎర్రుపాలెం: భూభారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో జరిగే సదస్సును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ సదస్సులో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

'సహకారం' సరికొత్తగా..

- పీఏసీఎస్‌ల్లో ఎఫ్‌పీఓ సంఘాలు
- భద్రాద్రి జిల్లాలో 11 పీఏసీఎస్‌ల ఎంపిక
- రైతుల ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యం



ఎఫ్‌పీఓగా ఎంపికైన బూర్గంపాడు పీఏసీఎస్

బూర్గంపాడు: రైతుల ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరిచేందుకు, పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీఓ (ఫార్మేషన్ అండ్ ప్రమోషన్ ఆఫ్) సంఘాలను ఏర్పాటు చేస్తోంది. దేశ వ్యాప్తంగా 10 వేల ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో 2020లో కేంద్రం దీనికి శ్రీకారం చుట్టింది. కంపెనీల చట్టం, సహకార చట్టం కింద నమోదైన సంఘాల్లోని సభ్యులతో ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లాలోని 21 పీఏసీఎస్‌లకు గాను తొలివిడతగా 11 సొసైటీల్లో ఎఫ్‌పీఓ సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. జిల్లాలోని పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, గుండాల, దుమ్ముగూడెం, చర్ల, గానుగపాడు, గుంపెన, కొత్తగూడెం, జూలూరుపాడు పీఏసీఎస్‌లకు ఇందులో స్థానం దక్కింది.

సభ్యులుగా 750 మంది రైతులు..

ఎఫ్‌పీఓ సంఘంలో 750 మంది రైతులు సభ్యులుగా ఉంటారు. ఒక్కొక్కరు రూ. 2000 చొప్పున వాటాధనం చెల్లించి సభ్యులుగా చేరాలి. రైతుల ఈక్విటీగా మొత్తం రూ.15 లక్షలు జమచేస్తే, కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.15 లక్షలు అందిస్తుంది. ఎఫ్‌పీఓలకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను, పాలక మండలిని కూడా ఎన్నుకోవాలి. ఎఫ్‌పీఓలలో సగం మంది సన్న, చిన్నకారు రైతులతో పాటు మహిళా రైతులకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలి. ఎఫ్‌పీఓల నుంచి 18 నెలల వ్యాపార ప్రణాళిక, బడ్జెట్‌తో వ్యవసాయ సంబంధిత వ్యాపారాలు చేపట్టాలి. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, యంత్ర పరికరాలను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడం, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం వంటి వ్యాపారాలను ఎఫ్‌పీఓలు చేపట్టాల్సి ఉంటుంది. విత్తనోత్పత్తి, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం వంటి అధిక ఆదాయం వచ్చే ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి.

ఆదాయం పెంపే లక్ష్యంగా..

ఎఫ్‌పీఓలతో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన వ్యాపారాలను విస్తృతపరచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, సాగుకు అవసరమైన యంత్ర పరికరాలు, వ్యవసాయ పనిముట్ల విక్రయాలు చేపట్టాలని భావిస్తోంది. ఉద్యానవన పంటల మార్కెటింగ్, పశుపోషణ, జీవాల పెంపకాలకు అవసరమైన వసతులు కల్పించడం వంటి పనులు నిర్వహించి ఆదాయాన్ని పెంచుకోవటమే లక్ష్యంగా ఎఫ్‌పీఓలు పనిచేయాల్సి ఉంది. ఎఫ్‌పీఓల ఆదాయ, వ్యయాలను పర్యవేక్షించేందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని కూడా ఏర్పాటు చేయనున్నారు.

విత్తనాలు, ఎరువుల విక్రయం..

ఇప్పటికే పీఏసీఎస్‌లు రైతులకు వ్యవసాయ రుణాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతను కూడా పీఏసీఎస్‌లకే అప్పగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కాక ముందు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కుదేలయ్యాయి. రైతులు తీసుకున్న అప్పులు చెల్లించక ఆర్థికంగా దెబ్బతిన్నాయి. వైఎస్ ముఖ్యమంత్రి అయ్యాక రైతుల వ్యవసాయ రుణాలు, బంగారం తాకట్టు రుణాలు పూర్తిస్థాయిలో మాఫీ చేయడంతో సహకార రంగం ఊపిరి పీల్చుకుంది. ఆయన హయాంలోనే పీఏసీఎస్‌లను బలోపేతం చేసేందుకు ఎరువులు, విత్తనాల విక్రయాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి పీఏసీఎస్‌లు బలోపేతం కాసాగాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీఓ సంఘాలు ఏర్పాటు చేస్తుండడంతో మరింత ఆర్థిక పరిపుష్టి సంతరించుకోనున్నాయి.

విందుల్లో విష సంస్కృతి

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం
- పుట్టగొడుగుల్లా పరిశ్రమల ఏర్పాటు, విక్రయం
- ఆహారపదార్థాల కలుషితం.. పరిశ్రమల పరిసరాల్లో ఇక్కట్లు

భద్రాచలంఅర్బన్: పట్టణాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న ఏ విందు అయినా భోజనం వడ్డించడం ఆనవాయితీ. గతంలో అరటి ఆకులు, అడ్డాకులు(విస్తర్లు) వినియోగించగా.. ఇప్పుడు ప్లాస్టిక్ బఫే పేట్లు తెరపైకి వచ్చాయి. పట్టణ ప్రాంతాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా వినియోగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం భద్రాచలంలోనే వీటి తయారీకి 6 – 7 కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్లేట్లలో భోజనాలు చేసే వ్యక్తులు ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లేనని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఆయా కార్యక్రమాల వద్ద తాగునీరు సమకూర్చేందుకు వినియోగిస్తున్న వాటర్ ప్యాకెట్లు కూడా అంతే ప్రమాదంగా మారుతున్నాయి.



భద్రాచలంలోని ఓ ఫ్యాక్టరీలో ప్లాస్టిక్ ప్లేట్లు

అంతా కలుషితమే...

ఇప్పుడు ప్రతీ గల్లీలో పేపర్ ప్లేట్ల పరిశ్రమలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే, వీటి తయారీకి ఉపయోగించే ముడిసరుకు ప్రమాదకరమని.. తయారీ అనంతరం మిగిలిన వ్యర్థాలను పొలాలు, చెరువుల పక్కన వేయడంతో ఆ ప్రాంతాలు కలుషితమవుతున్నాయని చెబుతున్నారు. అంతేకాక ఉపయోగం అనంతరం రహదారుల వెంట వేస్తుండడంతో అందులోని ఆహార పదార్థాలనే కాక ప్లేట్లను తింటున్న పశువులు సైతం రోగాల బారిన పడుతున్నాయి.



షాప్‌లకు తరలిస్తున్న ప్లేట్లు

ప్రమాదకర రసాయనాలు..

పేపర్ ప్లేట్లు, కప్పుల్లో ప్రమాదకర రసాయనాలు ఉంటాయని చెబుతున్నారు. హైడ్రోఫోబిక్ ఫిల్మ్ పొరను వినియోగిస్తుండగా.. మోట్రో సోమిన్,బిస్పినాల్, బార్ట్ ఇథనాల్ డాక్సిన్ వంటి కెమికల్స్ ఈ ప్లేట్లు, కప్పుల్లో ఉంటాయని తెలుస్తోంది. ఇందులో వేడి వేడి ఆహార పదార్థాలు వేశాక కరిగి ఆహార పదార్థాల ద్వారా మానవ శరీరంలోకి చేరుతాయని.. తద్వారా చర్మసంబంధిత వ్యాధులే ఇతర ప్రమాదకర వ్యాధుల బారిన పడే అవకాశముందని చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి



ప్లాస్టిక్ వినియోగం ఏదో ఒక రూపంలో ప్రజలను వెంటాడుతేనే పర్యావరణాన్ని కలుషితం చేస్తోంది. ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం రావడం లేదు. అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై మరింత చిత్తశుద్ధి పనిచేయాలి.

– మహేష్‌రెడ్డి, భద్రాచలం

ప్లాస్టిక్ నిర్మూలనపై దృష్టి



భద్రాచలంలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు కృషి చేస్తున్నాం. తొలుత షాపుల్లో కవర్ల వినియోగాన్ని నిర్మూలించే కార్యక్రమం చేపట్టాం. త్వరలో ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పుల తయారీ పరిశ్రమలపైనా దృష్టి సారిస్తాం. వాటర్ ప్లాంట్ల వద్ద కూడా పరిశీలిస్తాం.

– శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ ఈఓ, భద్రాచలం

లారీని ఢీకొట్టిన బస్సు.. తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

తిరుమలాయపాలెం: టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపిన లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా తృటిలో పెనుప్రమాదం తప్పింది. బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో 10మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు సోమవారం సాయంత్రం ఖమ్మం వస్తోంది. పిండిప్రోలు సమీపాన కాశీపట్నం వద్ద టైర్ పంక్చర్ అయి ఆగిన లారీని తప్పించే క్రమంలో ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో స్వల్పంగా గాయాలైన 10 మంది ప్రయాణికులను 108లో ఖమ్మం తరలించారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?



మొదటి వాహనముకు వందనం!



సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఎ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది. అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజ్ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేప్పొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...





బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్-ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్-బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్-బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలోకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెనీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్-జోన్ నోటిఫైయర్. ఇది హై-రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 2న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
రోహిణి కార్తె: జూన్ 8 వరకు
మృగశిర కార్తె: 8 నుంచి





'విత్తన బిళ్లల'తో వరి నాట్లు!



వరి విత్తనాలతో నారుమడి పోసి, తర్వాత పొలంలో నాటేయటం మనకు తెలుసు. అయితే, కేరళకు చెందిన అజి థామస్ అనే రైతు వినూత్నంగా ట్రేలలో విత్తన బిళ్లల్లో నారు పెంచి, ఆ తర్వాత బిళ్లలతో కూడిన నారునే పొలంలో నాటుతున్నారు. ఎకరానికి 2.5-5 కిలోల వరి విత్తనాలు చాలు. 20 రోజులు ముందే పంట కోతకు వస్తోంది. కూలీల ఖర్చు 75% తగ్గింది. హెక్టారుకు 5.5-6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని ఆవిష్కర్త చెబుతున్నారు.

- ఆవు పేడ, పంచగవ్య, జీవామృతంతో కూడిన బయో స్లర్రీతో వరి విత్తన బిళ్లల తయారీ
- విత్తన బిళ్లల్లో పెరిగిన వరి నారుతో పొలంలో నాట్లు
- మొక్కకు 50–60 పిలకలు.. హెక్టారుకు 6 టన్నుల ధాన్యం దిగుబడి
- 75% తగ్గిన మానవ శ్రమ
- కేరళ రైతు శాస్త్రవేత్త అజి థామస్ అద్భుత ఆవిష్కరణ

కేరళలోని వయనాడ్ జిల్లా అంబలవాయల్‌కు చెందిన అజి థామస్ కూరగాయలు, అరటి, రబ్బరుతో పాటు వరిని పండిస్తారు. రైతులు తగిన ఆదాయం లేక వరి సాగు మానుకుంటున్నారు. ఈ పూర్వరంగంలో బయో స్లర్రీతో వరి విత్తనాల 'పెల్లెటైజేషన్' పద్ధతిని ఆయన అభివృద్ధి చేశారు. విత్తనం చుట్టూ మట్టిని లేపనం చేస్తే వాటిని విత్తన గుళికలు అనొచ్చు. ఇది అలా కాదు. నాలుగు పలకలుగా ఉండే పేడ తదితర పోషకాలతో కూడిన బిళ్లలో వరి విత్తనం పెంచి, నాట్లేస్తారు. కాబట్టి 'విత్తన బిళ్లలు' అని చెప్పుకుందాం.

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిపై అధ్యయనం చేసి బయో స్లర్రీలోని సూక్ష్మజీవులు పొలం మట్టిలోని పోషకాలను విచ్ఛిన్నం చేసి వరి మొక్కలకు అందించటంతో రెట్టింపు దిగుబడి వస్తున్నదని వారు తెలిపారు.

ఈ పద్ధతిలో హెక్టారుకు 5.5–6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని, వయనాడ్ ప్రాంతంలో సాధారణ పద్ధతిలో వచ్చే ధాన్యం దిగుబడితో పోల్చితే రెట్టింపని థామస్ తెలిపారు. కూలీల ఖర్చు 25 శాతానికి తగ్గింది. ప్రతి కుదురుకు 50–60 పిలకలు వస్తున్నాయి. కంకి పొడవు పెరిగింది. ఎకరానికి వరి విత్తనాల అవసరం 30–50 కిలోల నుంచి 2.5–5 కిలోలకు తగ్గింది. పంట 15–20 రోజులు ముందే కోతకు వస్తోందని అజి థామస్ తెలిపారు.

విత్తన బిళ్లల తయారీ ఖర్చు ఎంత?

హెక్టారుకు సరిపడా వరి విత్తన బిళ్లల తయారీకి 12–14 కిలోల బయో–స్లర్రీ అవసరం. దీనికి హెక్టారుకు రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇది సాధారణ రసాయనిక సాగు పద్ధతిలో ఎరువులు, ఇతర ఉత్పాదకాల సగటు ఖర్చు కంటే రెట్టింపు. అయినప్పటికీ, కూలీల అవసరం/ఖర్చు, విత్తనాల ఖర్చు తగ్గి ధాన్యం దిగుబడి రెట్టింపు కావటంతో ఈ పద్ధతిలో వరి సాగు లాభదాయకంగా మారిందని థామస్ వివరించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

కేరళ ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఈ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. దీంతో, ఈ పద్ధతి కేరళలో రైతుల ఆదరణ పొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అజి థామస్ చెబుతున్నారు.

'విత్తన బిళ్ల' అంటే? తయారీ ఎలా?

వరి విత్తనాలను ట్రేలలోని చిన్న చిన్న చతురస్రాకారపు గదుల్లో బయో స్లర్రీని నింపి, అందులో వరి విత్తనం పెట్టి, మొలకెత్తిస్తారు. ఆ తర్వాత పొలంలో నాట్లు వేసే పద్ధతి ఇది. ఆవుపేడ, పులియబెట్టిన ఆకుల ద్రావణం, పంచగవ్య, ద్రవ జీవామృతంతో పాటు సూడోమోనాస్, అజోస్పిరిల్లమ్ వంటి జీవన ఎరువులు కలిపి బయో–స్లర్రీ మిశ్రమాన్ని తయారు చేస్తారు. బల్ల మీద ఉంచిన స్టెయిన్‌లెస్ స్టీల్ ట్రేలో లేదా సాధారణ బోలు రబ్బరు మ్యాట్‌లో 1–1.5 అంగుళాల లోతు/పొడవు/వెడల్పుతో నలుచదరంగా ఉండే గుంతల్లో బయో స్లర్రీని పోసి, అందులో వరి విత్తనాలను గుచ్చుతారు. ఒక రోజులో ఆ స్లర్రీ గట్టిపడి విత్తన బిళ్లలు తయారవుతాయి. ఆ తర్వాత ట్రే నుంచి విత్తనంతో కూడిన ఆ బిళ్లలను బయటకు తీసి 12 గంటలు ఎండబెడతారు. ఆ తర్వాత వాటిపై నీరు చిలకరిస్తారు. 3 రోజుల్లో వరి మొలకలు బయటకు వచ్చి, తగినంత ఎత్తు పెరిగిన తర్వాత, ఆ బిళ్లతో కూడిన వరి నారును దమ్ము చేసిన పొలాల్లో మనుషులతో వరుసలుగా నాటుతారు. వరుసల మధ్య 25 సెం.మీ. (పది అంగుళాలు) దూరం పెడుతున్నారు. ఎకరానికి ఇట్లాంటి వరి నారు బిళ్లలు 64 వేలు అవసరమవుతాయి. ఇదే ప్యాడీ సీడ్ పెల్లెటైజేషన్ పద్ధతి.

జఠిలమైన చెదలుకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారాన్ని కనుగొన్న రాజస్థాన్ వృద్ధ మహిళా రైతు

యూకలిప్టస్ కర్ర ముక్కలను పొలంలో ఉంచటం ద్వారా.. చెద పురుగులు పంటలను పాడు చెయ్యకుండా కాపాడుతున్నారు



చెదలుకు యూకలిప్టస్‌తో చెక్!

చెద పురుగులు.. ఇళ్లలోనే కాదు, పంట పొలాల్లో కూడా సమస్యలు సృష్టిస్తుంటాయి. పంటలను ఆశిస్తూ 10 నుంచి 50% వరకు దిగుబడి నష్టం కలిగిస్తుంటాయి. రైతులు సాధారణంగా రసాయనాలు చల్లి పంట పొలాల్లో చెదలును నియంత్రించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే, రసాయనాలతో పని లేకుండా సులభంగా, స్వల్ప ఖర్చుతో చెదలు సమస్యకు పరిష్కారాన్ని వెదకటంలో ఓ వృద్ధ మహిళా రైతు అసాధారణమైన విజయం సాధించారు. యూకలిప్టస్ కొమ్మలు/కట్టె ముక్కలను పొలంలోని పంటల సాళ్ల మధ్య ఉంచితే, చెద పురుగులు పక్కనే ఉన్న పంటల జోలికి వెళ్లకుండా యూకలిప్టస్ కొమ్మలనే ఆశిస్తున్నాయని ఆమె కనుగొన్నారు.

తళుక్కుమన్న ఉపాయం

పనులు చేస్తూనే అసాధారణంగా ఉన్న విషయాలను గమనిస్తూ ఉండటం భగవతి దేవికి అలవాటు. వంట కలపను ఇంటికి తెచ్చి పొయ్యిలో పెడుతున్న ఒక సందర్భంలో ఆమె దృష్టిని యూకలిప్టస్ కర్రలు ఆకర్షించాయి. యూకలిప్టస్ కర్ర ముక్కల పైకి మిగతా కర్రల కంటే చాలా ఎక్కువ చెదపురుగులు చేరుతున్నట్లు ఆమె గుర్తించారు. ఈ గ్రహింపు కలిగిన మరుక్షణమే ఆమె మదిలో ఒక కొత్త ఉపాయం తళుక్కున మెరిసింది. ఆలోచన వచ్చిందే తడవుగా అప్పుడు సాగులో ఉన్న సజ్జ పంటలో అమలు చేసింది. 2 నుంచి 3 అడుగుల పొడవు, 2 నుంచి 3 అంగుళాల లావు ఉన్న యూకలిప్టస్ కర్ర ముక్కలను తీసుకొని, సజ్జ పొలం అంతటా సాళ్ల మధ్యలో పెట్టింది. ఆమె అనుకున్నట్లుగానే, ఆ కర్ర ముక్కల చుట్టూ వేలకొలది చెద పురుగులు చేరి, కర్రలను కొరికి తినటం ప్రారంభించాయి. ఆశ్చర్యమేమిటంటే.. చెద పురుగులు ఇక సజ్జ మొక్కల జోలికి పోలేదు. యూకలిప్టస్ కర్ర ముక్క నుంచి 4 అంగుళాల దూరంలో ఉన్న సజ్జ మొక్కలను కూడా అవి ఆశించలేదు. అంతే. భగవతి దేవి మోహం ఆనందంతో వెలిగిపోయింది.

సజ్జ నుంచి గోధుమ వరకు..

గోధుమ చేనులో 12× 12 మీటర్ల దూరంలో ఎకరానికి 32 చొప్పున స్ప్రింక్లరు ఉంటాయి. ప్రతి స్ప్రింక్లర్‌కు దగ్గర్లో ఒక యూకలిప్టస్ కట్టె ముక్క/కొమ్మను ఆమె పెట్టారు. ఒక్క గోధుమ మొక్కను కూడా చెదలు ఆశించలేదు. ఒక్కో కట్టె ముక్కను వేలకొద్దీ చెద పురుగులు చుట్టుముట్టాయి. అంటే పంట వైపు నుంచి ఈ యూకలిప్టస్ కట్టెలు చెదపురుగుల దృష్టిని వంద శాతం మళ్లించాయన్న మాట. ఎకరానికి ఖర్చు కేవలం రూ. 320లు. ఈ కట్టెలను ప్రతి పంట కాలానికీ కొత్తవి వేయాల్సిన అవసరం లేదు. మూడు పంటల వరకు అవే సరిపోతున్నాయని ఆమె తెలిపారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ గుర్తింపు

భగవతి దేవి ఈ విషయాన్ని ఫతేపూర్ షెఖావతిలోని కేవీకే శాస్త్రవేత్తల చెప్పారు. వరుసగా నాలుగేళ్ల పాటు అనేక పంటల్లో ప్రయోగం చేసి సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. బికనెర్‌లోని రాజస్థాన్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బార్లీ పంటలోనూ అద్భుత ఫలితాలు రావటంతో, రైతులందరికీ ఇది అనుసరించమని చెబుతున్నారు.

చిరుధాన్యాలను సాళ్లుగా విత్తుకుంటే మేలు

ఐఐఎంఆర్‌లో 11 రకాల చిరుధాన్యాల విత్తనాలు సిద్ధం



హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తుకోవటానికి అనువైన 11 రకాల చిరుధాన్యాల విత్తనాలను విక్రయిస్తున్నారు. జొన్నలు, పచ్చజొన్నలు ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి. ఇతర చిరుధాన్యాలన్నీ ఎకరానికి 2 కిలోలు సరిపోతాయని, ఎకరానికి సరిపోయే విత్తనంతో బ్యాగ్‌లను సిద్ధం చేశామని ఐఐఎంఆర్ విత్తన విభాగం సాంకేతిక అధికారి రఘునాథ్ కులకర్ణి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

వరుసలుగా విత్తుకుంటే మేలు: చిరుధాన్య పంటలను వెదజల్లటం కాకుండా వరుసలుగా విత్తుకోవటం మేలు. కూలీలతో కలుపు తీయిస్తే రైతుకు మిగిలేదేమీ ఉండదు. వరుసలుగా విత్తుకుంటే యంత్రాలతో అంతరసేద్యం చేస్తూ కలుపును నిర్మూలించుకోవచ్చు. సాధారణంగా వరుసల మధ్య 22.5 సెం.మీ. దూరం పెడతారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న వీడర్ యంత్రాల వెడల్పును బట్టి సాళ మధ్య దూరాన్ని నిర్ణయించుకోవచ్చు. అవసరాన్ని బట్టి 30 సెం.మీ. / 40 సెం.మీ. / 45 సెం.మీ. వరకు కూడా సాళ్ల మధ్య దూరం పెట్టుకోవచ్చని రఘునాథ్ వివరించారు.

- జొన్న (దేశీ రకం/ హైబ్రిడ్), పచ్చజొన్న, పచ్చిగడ్డి కోసం పెంచే జొన్న ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి.
- సజ్జ, రాగు (కెఎంఆర్ 301), కొర్ర (సూర్యనంది), సామ (సిఎల్ఎంవి1), ఊద (డిహెచ్‌బిఎం93-3), వరిగ (టిఎన్ఎయు 202), అరిక (సికెఎంవి2), అండుకొర్ర (హెచ్‌బిఆర్2)లను ఎకరానికి 2 కిలోలు విత్తుకోవాలి. ఈ విత్తనాలు ఐఐఎంఆర్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతులు స్వయంగా వచ్చి కొనుక్కెళ్లాలి. ఇతర వివరాలకు.. 040-24599305.

చిరుధాన్యాల విత్తనాలు దొరికే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు: నంద్యాల (99896 25208), పెరుమాళ్లపల్లి (87906 38715), పాలెం (97050 69580)లలోని కూడా కొన్ని రకాల చిరుధాన్య పంటల విత్తనాలు అందుబాటులో ఉంటాయి.

కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

క్లాసికల్ ఫార్మాట్‌లో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్



స్టావెంజర్: మాగ్నస్ కార్ల్‌సన్... చెస్ గురించి తెలిసిన వారికి, క్రీడాభిమానులకూ సుపరిచితమైన పేరు... ప్రపంచ చదరంగంలో అతను 14 ఏళ్లుగా వరల్డ్ నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు... క్లాసికల్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఏకంగా ఎనిమిదిసార్లు విశ్వవిజేతగా నిలిచాడు. ఏమాత్రం చిన్న అవకాశం దొరికినా ఓటమి అంచుల్లో నుంచి విజయాన్ని అందుకోవడంలో దిట్ట. ఇలాంటి అసాధారణ నైపుణ్యమున్న ప్లేయర్‌తో గేమ్ ఆడుతూ 'డ్రా' చేసుకుంటే అది విజయంతో సమానం. ఇక నేరుగా గెలిస్తే అది పెద్ద సంచలనమే అవుతుంది. అలాంటి సంచలనమే నమోదు చేశాడు భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న నార్వే ఓపెన్ టోర్నీలో కార్ల్‌సన్‌పై గుకేశ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... తన కెరీర్‌లో తొలిసారి క్లాసికల్ గేమ్‌లో కార్ల్‌సన్‌పై గెలిచాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఆరో రౌండ్ గేమ్‌లో 19 ఏళ్ల గుకేశ్ తెల్ల పావులతో ఆడుతూ 62 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు. నాలుగు గంటలపాటు జరిగిన ఈ గేమ్‌లో కార్ల్‌సన్ 52వ ఎత్తులో చేసిన తప్పిదాన్ని గుకేశ్ అనుకూలంగా మల్చుకొని సంచలన ఫలితం సాధించాడు. తనను 'ఢీ'కొట్టే సరైన ప్రత్యర్థులు లేకపోవడంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌పై ఆసక్తి కోల్పోయి కొన్నాళ్లుగా ఆ మెగా ఈవెంట్‌కు దూరంగా ఉంటున్న 34 ఏళ్ల కార్ల్‌సన్‌కు... భవిష్యత్‌లో గట్టి ప్రత్యర్థి కాగల సత్తా తనలో ఉందని గుకేశ్ నిరూపించుకున్నాడు.

అసహనంతో...



గుకేశ్ చేతిలో తొలిసారి ఓటమి చవిచూసిన కార్ల్‌సన్ పరాజయ భారాన్ని తట్టుకోలేకపోయాడు. ఊహించనిరీతిలో స్పందించాడు. తన నుంచి జరిగిన ఒక్క తప్పిదాన్ని అనుకూలంగా మల్చుకొని గుకేశ్ గెలుపు బాట పట్టడంతో కార్ల్‌సన్ ఆ కోపాన్నంతా తాము ఆడిన చెస్ బోర్డు టేబుల్‌పై చూపించాడు. తన పిడికిలితో ఒక్కసారిగా టేబుల్‌పై కార్ల్‌సన్ గట్టిగా కొట్టాడు. ఆ వెంటనే తమాయించుకున్న కార్ల్‌సన్ పావులను చెస్ బోర్డుపై అమర్చి... గుకేశ్‌కు వద్దకు వెళ్లి రెండుసార్లు సారీ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కార్ల్‌సన్‌ను ఓడించిన తర్వాత గుకేశ్ కొన్ని క్షణాలపాటు షాక్‌లో ఉండిపోయి ఆ తర్వాత ఈ విజయాన్ని ఆస్వాదించాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ 8.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మొదటి ట్రోఫీని ముద్దాడేందుకు...

ఐపీఎల్ 2008లో మొదలైంది... తొలి సీజన్... రెండు.... మూడు... నాలుగు... ఇలా చూస్తూ చూస్తూ 17 సీజన్లు గడిచిపోయాయి. కానీ ఒక్కసారైనా విజేతగా నిలవాలనే ఆ రెండు జట్ల కోరిక మాత్రం నెరవేరలేదు. ఇన్నేళ్లలో ఎంతో మంది ఆటగాళ్లు మారారు... కోచ్‌లు కొత్తగా వచ్చారు, వ్యూహాలూ మారాయి... వైఫల్యాలతో నిష్క్రమించిన ప్రతీసారి వచ్చే ఏడు మనదే అవుతుందనే ఆశతో మళ్లీ సున్నా నుంచి మొదలు పెట్టడం, ఆపై కీలక దశలో కుప్పకూలడం సాధారణంగా మారిపోయాయి తప్ప ఐపీఎల్ టైటిల్ ద్రాక్ష అందనే లేదు... ఒక టీమ్ ఈ ప్రయత్నంలో మూడుసార్లు తుది పోరుకు చేరి నిరాశతో వెనుదిరగ్గా... మరో జట్టు ఒకే ఒక్కసారి ఆఖరి మెట్టుకు చేరి చతికిలపడింది... ఇప్పుడు ఆ రెండు టీమ్‌లలో ఒకరికి ఉపశమనం దక్కే సమయం వచ్చింది. ఐపీఎల్ 18వ సీజన్‌లో కొత్త జట్టు చాంపియన్‌గా నిలవడం ఖరారైన నేపథ్యంలో తొలిసారి ఈ టైటిల్‌ను ఎవరు అందుకుంటారనేది ఆసక్తికరం. మొదటి ట్రోఫీ వేటలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో సర్వశక్తులూ ఒడ్డనున్నాయి.

రాత్రి 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



శ్రేయస్ అయ్యర్

రజత్ పాటీదార్

అహ్మదాబాద్: ఐపీఎల్–18 సీజన్‌లో 73 హోరాహోరీ మ్యాచ్‌ల తర్వాత ఈ ఏడాది విజేతను తేల్చే అసలు సమరానికి అంతా సిద్ధమైంది. నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. లీగ్ దశలో ప్రదర్శనను చూస్తే ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపించాయి. రన్‌రేట్ కారణంగా పంజాబ్ మొదటి స్థానంలో, బెంగళూరు రెండో స్థానంలో నిలిచినా... రెండు టీమ్‌లూ సమంగా తొమ్మిదేసి విజయాలు సాధించి 19 పాయింట్లతో నిలిచాయి. 'ప్లే ఆఫ్స్'కు ముందు ప్రత్యర్థులుగా తలపడిన మ్యాచ్‌లలో ఇరు జట్లు ఒక్కో విజయాన్ని అందుకోగా... క్వాలిఫయర్–1లో పంజాబ్‌ను చిత్తు చేసి బెంగళూరు పైచేయి సాధించింది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో గెలిచి పంజాబ్ లెక్క సరి చేస్తుందా లేదా ఆర్‌సీబీ ఆధిత్యం కొనసాగుతుందా చూడాలి. మొత్తంగా ఎవరు గెలిచినా తొలి ట్రోఫీతో సంబరాలు అంబరాన్ని తాకడం ఖాయం.

సమష్టి ప్రదర్శనతో...

ఐపీఎల్‌లో ఆర్‌సీబీ 2016లో ఆఖరిసారిగా ఫైనల్ చేరింది. ఆ మ్యాచ్‌లో ఓటమి తర్వాత ఆడిన ఎనిమిది సీజన్లలో జట్టు ప్రదర్శన అంతంత మాత్రమే. ముఖ్యంగా ఎవరో ఒక ఆటగాడి ప్రదర్శనపైనే ఆధారపడటం, అతను విఫలమైతే జట్టు కుప్పకూలడం తరచుగా సాగాయి. కానీ ఈ సీజన్ పూర్తి భిన్నంగా కనిపించింది. జట్టు పది మ్యాచ్‌లు గెలిస్తే తొమ్మిది మంది వేర్వేరు ఆటగాళ్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'లుగా నిలిచారు. ఒకరు విఫలమైతే మరొకరు ఆదుకోవడంతో కీలక సమయాల్లో కూడా జట్టు పట్టు వీడలేదు. ఇప్పుడు అదే శైలి, పోరాటతత్వం బెంగళూరును ఫైనల్‌కు చేర్చాయి. ఎప్పటిలాగే స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి 600కు పైగా పరుగులు, 8 అర్ధసెంచరీలతో జట్టుకు చుక్కానిలా నిలిచాడు. అతని ఓపెనింగ్‌లో సరైన జోడీగా ఫిల్ సాల్ట్ 387 పరుగులతో శుభారంభాలు అందించాడు. మిగతా బ్యాటర్లలో షెఫర్డ్, జితేశ్, కృనాల్ పాండ్యా కూడా ప్రభావవంతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ పాటీదార్ గత ప్రదర్శనలతో పోలిస్తే ఈసారి అంత అద్భుతంగా ఆడకపోయినా... కెప్టెన్‌గా తొలి సీజన్‌లో జట్టును ఫైనల్ చేర్చిన ఘనత అతనికి దక్కింది. మైదానంలో కోహ్లి అనుభవం, సూచనలు అండగా ఉన్న పాటీదార్ నాయకత్వంలో టీమ్ టైటిల్ గెలిస్తే ఆర్‌సీబీ అభిమానుల కోరిన నెరవేర్చిన ప్రత్యేక వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతాడు. బౌలింగ్‌లో కూడా టీమ్ పటిష్టంగా కనిపిస్తోంది. జట్టు బౌలింగ్ సత్తా తొలి క్వాలిఫయర్‌లో పంజాబ్‌పైనే కనిపించింది. ముఖ్యంగా హాజల్‌వుడ్ ఆస్ట్రేలియా నుంచి తిరిగి రావడం ఒక్కసారిగా జట్టు బలాన్ని పెంచింది. 21 వికెట్లతో అతను టీమ్ విజయాల్లో కీలకపాత్ర పోషించగా... భువనేశ్వర్, యశ్ దయాళ్ సహకరించారు. లెగ్ స్పిన్నర్ సుయాశ్ శర్మ కూడా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టిపడేయగలడు.

ఆ నలుగురితో కలిసి...

తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌ను మినహాయిస్తే సీజన్ ఆసాంతం పంజాబ్ ప్రదర్శన అద్భుతంగా సాగింది. ముఖ్యంగా రెండో క్వాలిఫయర్‌లో ముంబైని చిత్తు చేసిన తీరు ఆ జట్టు సామర్థ్యాన్ని చూపించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన అసాధారణ బ్యాటింగ్‌తో 600కు పైగా పరుగులు చేయడంతో పాటు సమర్థ నాయకత్వంతో జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇద్దరు విదేశీ బ్యాటర్లు ఇన్‌గ్లిస్, స్టొయినిస్‌లకు కీలక సమయాల్లో ఒత్తిడిని దాటి చెలరేగిపోగల నైపుణ్యం ఉంది. అయితే పంజాబ్ విజయాల్లో కీలక పాత్ర మరో నలుగురు బ్యాటర్లు పోషిస్తున్నారు. వీరంతా జాతీయ జట్టుకు ఆడని 'అన్‌క్యాప్డ్' ఆటగాళ్లే కావడం విశేషం. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్‌తో పాటు నేహల్ వధేరా, శశాంక్ సింగ్ ఈ మ్యాచ్‌లో రాణిస్తే కింగ్స్‌కు తిరుగుండదు. పంజాబ్ బౌలింగ్‌లో కాస్త తడబాటు కనిపిస్తోంది. అర్ష్‌దీప్ ఆశించిన స్థాయిలో సరైన ఆరంభాలు ఇవ్వడం లేదు. జేమీసన్ మెరుగ్గా ఉన్నా, మూడో పేసర్ అజ్మతుల్లా బౌలింగ్ కూడా సాధారణంగానే ఉంది. చహల్ స్పిన్ మరోసారి కీలకం కానుంది. ఫైనల్ ఒత్తిడిని అధిగమిస్తే పంజాబ్‌కు గెలుపు కష్టం కాబోదు.

తుది జట్ల వివరాలు (అంచనా)	పిచ్, వాతావరణం
బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, మయాంక్ అగర్వాల్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెఫర్డ్, భువనేశ్వర్, కృనాల్ పాండ్యా, యశ్ దయాళ్, హాజల్‌వుడ్. పంజాబ్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, స్టొయినిస్, శశాంక్ సింగ్, అజ్మతుల్లా, చహల్, జేమీసన్, అర్ష్‌దీప్ సింగ్.	సీజన్ ఆరంభం నుంచి భారీ స్కోర్లు నమోదయ్యాయి. రెండో క్వాలిఫయర్ తరహాలోనే టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపవచ్చు. వర్ష సూచన ప్రస్తుతానికి లేదు కానీ వాన వస్తే అదనపు సమయంతో పాటు బుధవారం 'రిజర్వ్ డే' కూడా ఉంది.

సాక్షి సినిమా

మనసు నీకై రథమయ్యే రారా...



• కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'విశ్వద నాయక...' అంటూ సాగే నాలుగో పాటని విడుదల చేశారు. 'విశ్వద నాయక.. విహిత వీరా... మనసు నీకై.. రథమయ్యే రారా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాటలో కమల్‌హాసన్ క్యారెక్టర్ నేచర్, అభిరామి, త్రిష పాత్రల్లోని డైనమిక్స్‌ని లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్ ఈ పాటకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా జాయ్ వండర్ ఫుల్ వోకల్స్ ఎమోషన్‌ని నావిగేట్ చేయగా, ఏఆర్ అమీన్ ర్యాప్ ఎనర్జీని మరింతగా పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కుబేర ప్రేక్షకులకి నచ్చుతుంది

– నాగార్జున



• నాగార్జున, ధనుష్

''చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా నాకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. 'కుబేర'ని శేఖర్‌గారు అద్భుతంగా తీశారు. ఈ చిత్రం ప్రేక్షకులకి కచ్చితంగా నచ్చుతుంది. ఈ మూవీ తర్వాత రజనీకాంత్ గారి 'కూలీ' సినిమా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి రెడీగా ఉంది'' అని హీరో నాగార్జున అక్కినేని తెలిపారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'కుబేర' ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''కుబేర' కోసం తిరుపతిలో ఎండలో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలతో బిచ్చగాడిగా నటించడం మరచిపోలేను. ఆ అనుభవం జీవితంలోని ముఖ్యమైన సత్యాలను గుర్తు చేసింది'' అన్నారు. ''కుబేర' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు రష్మికా మందన్నా. ''ధనుష్, నాగార్జునగారి నటన మెస్మరైజింగ్‌గా ఉంటుంది'' అని శేఖర్ కమ్ముల తెలిపారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.. గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కుర్ రామ్‌మోహన్ రావు, సునీల్ నారంగ్. ఈ కార్యక్రమంలో దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు జాన్వీ నారంగ్, భరత్ నారంగ్, సిమ్రాన్ నారంగ్, కెమేరామేన్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు.

జూలైలో ఘాటి



• 'ఘాటి' పోస్టర్

హీరోయిన్ అనుష్కాశెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు మరో లీడ్ రోల్ చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమాని జూలై 11న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'ఘాటి' సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందించగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. వ్యాపార రంగంలో పైస్థాయికి వెళ్లాలనుకునే ఓ మహిళను కొందరు మోసం చేస్తారు. దీంతో ఆ మహిళ వారికి తగిన బుద్ధి చెప్పి, వ్యాపారంలో అత్యున్నత స్థాయికి ఎలా చేరుకుంటారు? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.

దీపావళికి తెలుసు కదా



• సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా, వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 17న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ''మనసును తాకేలా, ఊహించని మలుపులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నాన్న అంటేనే దైవం



• పృథ్వీ అంబర్, సాయికుమార్

''నాన్న అంటేనే మొదటి దైవం.. తను పోసిన ప్రాణమిది.. నాన్న అనగానే వాలే నీ ముందు.. అలుపెరుగని ప్రాణమిది.. మన కొరకే బతికే ప్రాణం.. మన బాధ్యత ఒకటే ధ్యానం'' అంటూ సాగుతుంది 'చౌకీదార్' సినిమాలోని 'నాన్న' యాంథమ్ పాట లిరికల్ వీడియో. పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా, సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'చౌకీదార్'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో డా. కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మించారు. సచిన్ బస్రూర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంతోష్ వెంకీ సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు

– రూపేశ్



• పవన్ ప్రభ, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

''షష్టిపూర్తి' అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' చిత్రం నుంచి 'షష్టిపూర్తి' వరకు ఏ నటుడికి దక్కని సినిమా ప్రయాణం నాకు దక్కింది. 'షష్టి పూర్తి' చూస్తూ ప్రేక్షకులు ఏడ్చేస్తున్నారంటేనే మేం విజయం సాధించినట్టు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్ నిర్మించిన ఈ సినిమా మే 30న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కల్చరల్ బ్లాక్‌బస్టర్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ–''విజయ, వాహినీ, ఏవీఎం వంటి గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో చెబుతున్నాను.. నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి పాత్రలు నా చివరి శ్వాస వరకు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ–''షష్టిపూర్తి'ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు'' అని తెలిపారు. ''షష్టిపూర్తి' లాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే నా లాంటి దర్శకులు, రూపేశ్ లాంటి నిర్మాతలు ఇంకా ముందుకు వస్తారు'' అన్నారు పవన్ ప్రభ. ఈ కార్యక్రమంలో కెమేరామేన్ రామ్, పాటల రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.

తెలంగాణ కళాకారులకు అన్యాయం జరిగింది

– ప్రతాని రామకృష్ణగౌడ్



• అమృత్ గౌడ్, రమేశ్ నాయుడు, ప్రతాని రామకృష్ణ, కిరణ్

''తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌గారి పేరుతో అవార్డ్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే ఈ అవార్డు కమిటీ జ్యూరీకి మురళీ మోహన్, జయసుధలను చైర్మన్లుగా నియమించడం ఏంటో అర్థం కాలేదు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'దిల్' రాజు తన అధికారాలను దుర్వినియోగం చేశారు. తన వాళ్లకే అవార్డ్స్ ఇచ్చుకున్నారు. జ్యూరీ కమిటీలో ఉన్నవాళ్ల సినిమాలకు అవార్డ్స్ ఇవ్వకూడదనే నిబంధనలను పాటించ లేదు. థియేటర్స్ బంద్ విషయంలోనూ 'దిల్' రాజు ప్రమేయం ఉంది'' అని 'తెలంగాణ ఫిలిం చాంబర్' చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. జ్యూరీ కమిటీ సభ్యులు అన్ని సినిమాలు చూడలేదు. థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం వల్ల గతంలో లాభాలు ఆర్జించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రస్తుత విధానాల వల్ల నష్టాలు వస్తున్నాయి. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత నిర్మాత డి. సురేష్ బాబులాంటి కొందరు తమ స్వార్థంతో అద్దె విధానాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్.. లాంటి వాళ్లు సురేష్ బాబు బాటలోనే నడిచి థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు'' అన్నారు. ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లను ప్రభుత్వం పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అన్నారు టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, నటుడు కిరణ్, తెలంగాణ డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, తెలంగాణ రైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అమృత్ గౌడ్ కోరారు.

డేంజర్ బాయ్స్



• వికాస్, రాధా

వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహళ్లి ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'అపాయవీడి హెచ్చరిక'. అభిజిత్ తీర్థహళ్లి దర్శకత్వంలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను యశశ్విని క్రియేషన్స్, గీతా ఫిల్మ్స్‌పై శ్రీరంగం సతీష్ కుమార్ తెలుగులో 'డేంజర్ బాయ్స్' టైటిల్‌తో త్వరలో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్‌లుక్‌ని, దర్శక–నిర్మాత సాయివెంకట్ టీజర్‌ను, నిర్మాత టి.రామసత్యనారాయణ– జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్య వర్ధన్ ఈ సినిమా పాటలను రిలీజ్ చేశారు.

తొలిప్రేమ తోపేం కాదు !



• శ్రీ గౌరీప్రియ, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కలర్ ఫొటో, బేబి' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ గౌరీప్రియ హీరోయిన్. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది', 'తొలిప్రేమ అంత తోపేం కాదు' అంటూ కిరణ్ చెప్పే డైలాగులు గ్లింప్స్‌లో ఉన్నాయి.